మాట మీద నిలబడిన నేత ఒక్క వైఎస్ జగనే

- చంద్రబాబు ప్రజలను నమ్మించి వంచించాడు
- రాష్ట్రంలో దరిద్రపు పాలన
- వైఎస్సార్‌సీపీ శ్రేణులకు అవగాహన కల్పించిన ఎమ్మెల్యే ఆకేపాటి, కొరముట్ల


కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తున్న జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి


సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, ప్రజలు

పుల్లంపేట : ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చి 14 నెలలు పూర్తయినా ఏ ఒక్క హామీని పూర్తిగా అమలు చేయలేదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, రాజంపేట శాసనసభ్యులు ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, రైల్వేకోడూరు మాజీ శాసన సభ్యులు కొరముట్ల శ్రీనివాసులు, పుల్లంపేట ఎంపీపీ ముద్దా బాబుల్‌రెడ్డిలు అన్నారు. శుక్రవారం పుల్లంపేట బైపాస్‌లోని జెడ్పీ కల్యాణ మండపంలో ఎంపీపీ ముద్దా బాబుల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ, రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టోపై శ్రేణులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకేపాటి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తోందన్నారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టి లక్షలాది మంది విద్యార్థుల జీవితాలలో వెలుగులు నింపారన్నారు. అలాగే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన ఏడాదికే కుల, మత, పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించారని పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం పథకాలను ప్రజలకు అందించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఇప్పుడు అన్ని చేసేశామని ఏమీ పెండింగ్ లేవని చంద్రబాబు చెబుతూ ప్రజలను వంచించారన్నారు.

అబద్ధపు హామీలతో అధికారంలోకి
– మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు 144పైచిలుకు అబద్ధపు హామీలు ఇచ్చారని, ప్రజలు నమ్మి గెలిపిస్తే ఏ ఒక్క పథకాన్ని అమలు చేయలేదని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొరముట్ల శ్రీనివాసులు తెలియజేశారు. పథకాలు అమలు చేయాలని ప్రశ్నిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. కూటమి దరిద్రపు పాలనను ప్రజలు గమనిస్తున్నారని, 2029 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ప్రతి కార్యకర్త వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. గ్రామస్థాయిలో కూటమి ప్రభుత్వ మోసాలను తెలియజేయాలన్నారు.

నియోజకవర్గంలో ఏడుగురు ఎమ్మెల్యేలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పుల్లంపేట మండలంలో ఎంపీ నిధులతో నిర్మించిన స్మశానాన్ని కూల్చివేశారని ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి తెలిపారు. కారకులపై ఇప్పటివరకు చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని, అలాగే మండల వ్యాప్తంగా 360 ఎకరాల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైంద న్నారు. అలాగే వత్తలూరు గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పథకం ద్వారా రూ.68 లక్షల నిధులను స్వాహా చేశారని ఫిర్యాదు చేసినా చర్యలకు నోచుకోలేదన్నారు. జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వస్తే రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని తిరగరాస్తామన్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో ఏడుగురు ఎమ్మెల్యేలు ఉన్నారని, ఒకరు అవును అంటే ఒకరు కాదంటున్నారని, ప్రజలకు పరిపాలన అందించడంలో పూర్తిగా వైఫల్యం చెందారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో పుల్లంపేట మండల కన్వీనర్ ముస్తాక్, అన్నమయ్య జిల్లా ఉపాధ్యక్షులు టంగుటూరు కృష్ణారెడ్డి, చెవ్వు శ్రీనివాసులు రెడ్డి, వత్తలూరు సాయికిషోర్ రెడ్డి, రైల్వేకోడూరు పంచాయతీరాజ్ వింగ్ ప్రెసిడెంటు ఎం.శంకర్ రెడ్డి, ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి, విజయ్ కుమార్ రెడ్డి, మణికంఠ, సుదర్శన్ రెడ్డి, రంగారెడ్డి, బికె మణి, ఆలం చెంగయ్య, అడ్వకేట్ నాయక్, రాజశేఖర్ రెడ్డి, రామసుబ్బారెడ్డి, రజనీ కుమార్ రెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

శీతల గంగమ్మకు పూజలు

సిద్దవటం : మండలంలోని పార్వతీపురం గ్రామంలో వెలసిన శ్రీ శీతల గంగమ్మ అమ్మవారికి శుక్రవారం శ్రావణమాసం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సంద్భంగా శ్రావణమాసం తొలిరోజు అమ్మవారికి అభిషేకం, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, అలంకరణ చేసినట్టు ఆలయ అర్చకులు రంగమ్మ తెలిపారు. ఆలయం చుట్టుపక్కల గ్రామాలకు చెందిన మహిళలు అమ్మవారికి కాయాకర్పూలను సమర్పించి పూజలు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలను స్వీకరించారు.

స్పెషలాఫీసర్ సుడిగాలి పర్యటన


చిన్నమండెం పీహెచ్‌సీలో రోగులతో మాట్లాడుతున్న స్పెషలాఫీసర్ సత్యనారాయణ

చిన్నమండెం : చిన్నమండెం మండల స్పెషలాఫీసర్ సత్యనారాయణ శుక్రవారం సుడిగాలి పర్యటన చేశారు. మొదటగా మండల పరిధిలోని చాకిబండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రోగులతో మాట్లాడి వైద్య సదుపాయాలపై ఆరా తీశారు. అనంతరం కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలను సందర్శించి కేజీబీవీ విద్యార్థినుల సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం దేవగుడిపల్లె డంపింగ్‌యార్డును పరిశీలించారు. ఆయన వెంట సూపర్‌వైజర్ సంపత్‌కుమార్, హెడ్ నర్స్ ధనలక్ష్మి, ఎస్‌ఓ అరుణ, పంచాయతీ సెక్రటరీ ప్రమీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేపు లక్కిరెడ్డిపల్లిలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ

లక్కిరెడ్డిపల్లి : వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ, రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టోపై పార్టీ శ్రేణులకు నిర్వహించే అవగాహన కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్.రమేష్‌కుమార్ రెడ్డి నివాసంలో ఆదివారం (రేపు)జరుపనున్నట్టు ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, జడ్పీటీసీ రమాదేవి, మాజీ ఎంపీపీ రెడ్డయ్యలు శుక్రవారం తెలియజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ సుగవాసి బాల సుబ్రమణ్యంలు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు హాజరుకావాలని కోరారు.

విద్యార్థుల సమస్యలపై పోరాటం


నియామకపత్రం అందుకుంటున్న దీపక్ రెడ్డి

ఓబులవారిపల్లె : ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేస్తామని ఏపీఎస్‌ఎఫ్ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు పాములూరు దీపక్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం అన్నమయ్య జిల్లా ఏపీఎస్‌ఎఫ్ అన్నమయ్య జిల్లా అధ్యక్షునిగా మండలానికి చెందిన పామూరి దీపక్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర అధ్యక్షులు ఆకుల రాఘవేంద్ర నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దీపక్ రెడ్డి తనకు కేటాయించిన పదవిని సమర్థవంతంగా నిర్వహిస్తామని, విద్యార్థుల సమస్యలపై పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. అన్నమయ్య జిల్లా అధ్యక్షునిగా ఎన్నిక కావడం పట్ల గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ఆలయంలో హోమం



సిద్దవటం : మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీలోని ఎస్‌కేఆర్ నగర్ గ్రామంలో వెలసిన శ్రీ భద్రావతి భావ నారాయణ స్వామి ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా శుక్రవారం హోమం పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు స్వామివారికి గణపతి పూజ, గణపతి హోమం, నవగ్రహ పూజ, నవగ్రహ అభిషేకం, నవగ్రహ హోమం, అష్టలక్ష్మి హోమం, భావనారాయణ స్వామి హోమం, మహా పూర్ణాహుతి, వంటి పూజా కార్యక్రమాలను వేద పండితులు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

అన్నదానం


రాజంపేట రూరల్ : పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించటం ఎంతో పుణ్యఫలమని ఎన్‌జీఓ సంఘం తాలుకా అధ్యక్షులు శెట్టెం వెంకటరమణ అభిప్రాయపడ్డారు. తన తండ్రి శెట్టెం రామకృష్ణయ్య 31వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం శెట్టెం వెంకటరమణ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు చేయూతనివ్వటం ఎంతో అనందదాయకమన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ


విద్యాసామగ్రిని అందజేస్తున్న దాత

సుండుపల్లె : విద్యాభివృద్ధికి దాతల సహాయం మరువలేనిదని ఎంఈఓ రవీంద్రనాయక్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రం సమీపంలోని తిమ్మసముద్రం ప్రాథమిక పాఠశాలకు పూర్వ విద్యార్థి దాత శివయ్య విద్యాసామగ్రిని అందజేయడం సంతోషదాయకం అన్నారు. రూ.7 వేలు విలువ చేసే విద్యాసామగ్రిని పాఠశాలలోని 30 మంది విద్యార్థులకు పంపిణీ చేసినట్లు తెలిపారు

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు


తోపుడు బండి నిర్వాహకుడిని హెచ్చరిస్తున్న తహసీల్దార్ భాగ్యలత

గాలివీడు : ప్రధాన రోడ్లపై వాహనాలు అడ్డుగా నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ భాగ్యలత హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక బస్టాండ్ ఆవరణలో, ప్రధాన రహదారికి ఇరువైపులా అడ్డుగా పెట్టిన తోపుడుబండ్లు, ద్విచక్ర వాహనాలను ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లుతో కలసి తీయించి వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్డు పక్కన ఫుట్‌పాత్ వరకు దుకాణాదారులు, ద్విచక్ర వాహనదారులు పార్కింగ్ చెయ్యడం ద్వారా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు

రక్తదానం మానవత్వానికి ప్రతీక


రక్తదాన శిబిరంలో ప్రిన్సిపల్ పురుషోత్తం ఇతరులు

రాజంపేట టౌన్ : రక్తం అవసరమైన వారికి సరైన సమయంలో రక్తదానం చేయడం మానవత్వానికి ప్రతీక అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.పురుషోత్తం తెలిపారు. కువైట్ అమ్మ హెల్పింగ్ హ్యాండ్స్, వికసిత ఫౌండేషన్, రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ప్రిన్సిపల్ ప్రారంభించి మాట్లాడారు. రక్తదానం ఎంతో గొప్పదని, రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. మనం చేసే రక్తదానం మరొకరికి పునర్జన్మనిస్తుందని తెలిపారు. రక్తదానంపై ఇప్పటికి గ్రామీణ ప్రాంత ప్రజలకు సరైన అవగాహన లేదన్నారు. రక్తం ఇవ్వడం వల్ల ఆరోగ్య సమస్యలు వస్తాయన్న అపోహ గ్రామీణుల్లో ఉందన్నారు. ఆరోగ్యవంతులైన వారు ప్రతి మూడు నెలలకు ఒకమారు రక్తం ఇవ్వచ్చని తెలిపారు. స్వచ్ఛంద సంస్థలు రక్తదాన శిబిరాలను నిర్వహించి రక్తం సేకరిస్తుండటం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెబివిఎస్ వ్యవస్థాపకుడు ఎం.అశోక్, రెడ్‌క్రాస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ యశస్విరెడ్డి, రెడ్‌రిబ్బన్‌క్లబ్ కో–ఆర్డినేటర్ డాక్టర్ బి.రామకృష్ణ, డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ వెంకటనరసయ్య, మహిళా సాధికారిత కో–ఆర్డినేటర్ పార్వతి, రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ ప్రతినిధులు ప్రశాంతి, ఉషారాణి, స్టీఫెన్, శ్వేత, సాయి తదితరులు పాల్గొన్నారు.

మిథున్‌రెడ్డి అరెస్టు వెనుక రాజకీయ కుట్ర

డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దండు గోపి



రాజంపేట : రాజంపేట లోక్‌సభ సభ్యుడు పీవీ మిథున్‌రెడ్డి అరెస్టు వెనుక రాజకీయ కుట్ర ఉందని ప్రజలందరూ ఇప్పటికే గుర్తించారని ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లా డీసీఎంఎస్ మాజీ చైర్మన్, దళిత విభాగం రాష్ట్ర నాయకుడు దండు గోపి అన్నారు. శుక్రవారం ఆకేపాటి భవన్‌లో ఆయన మాట్లాడుతూ పీవీ మిథున్ రెడ్డి కడిగిన ముత్యంలా తిరిగొస్తారన్నారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకుండా వైఎస్సార్‌సీపీ కీలక నేతలను వేధించడమే టార్గెట్‌గా పాలన కొనసాగిస్తున్నారన్నారు. నేతల అరెస్టుల క్రమంలో కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత పెలుబిక్కుతోందన్నారు. పీఎంవో కూడా మిథున్‌రెడ్డి అరెస్టుపై ఆరా తీసినట్లుగా వార్తలు వస్తున్నాయని చెప్పారు. పార్లమెంటరీ ప్యానల్ స్పీకర్‌గా ఎంపీ దేశ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. అయితే ఏపీలో అరాచక ప్రభుత్వం మిథున్‌రెడ్డిని పథకం ప్రకారం, లేని మద్యం స్కాంలో ఇరికించారన్నారు. రాజమండ్రి సెంట్రల్ జైలులో ఎంపీకి కల్పించాల్సిన కనీస సౌకర్యాలను కల్పించలేదన్న ఆరోపణలతో ప్రజలలో ఎంపీ పట్ల సానుభూతి, అభిమానం మరింతగా పెరిగిందన్నారు. రాష్ట్రం సంక్షేమ పాలన మరిచి డైవర్షన్ పాలిట్రిక్స్‌తో కూటమి ప్రభుత్వం యేడాదిపాటు కొనసాగిందన్నారు. ఇలాగే కొనసాగితే ప్రజలు తగిన రీతిలో కూటమి ప్రభుత్వానికి బుద్ధిచెప్పేందుకు సిద్ధమవుతారన్నారు. ఎల్లోమీడియా తప్పుడు కథనాలను వండి వార్చడం, వాటినే ఆధారంగా చేసుకొని అక్రమ కేసులు పెట్టడం చూస్తుంటే రాష్ట్రంలో రాక్షసరాజ్యం కొనసాగుతోందనడానికి నిదర్శనమని దండుగోపి అన్నారు.

మానవత ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు


బహుమతులను అందిస్తున్న మానవత సభ్యులు, ఉపాధ్యాయులు

చిట్వేలి : మండలంలో 2024–25 విద్యా సంవత్సరంలో మండలస్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మానవత చిట్వేలిశాఖ వారు నగదు బహుమతులు అందజేశారు. శుక్రవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి లక్ష్మీ త్రివేణికి రూ.6 వేలు, కె.రెడ్డి నిత్యకు రూ.4 వేలు, కె.శివదీక్షితకు రూ. 2 వేలు నగదు బహుమతులు అందజేశారు. కార్పొరేట్ పాఠశాలలకు సంబంధించి యు.జోస్మితకు రూ.6 వేలు, హారిక రూ.4 వేలు, కె.సిరి రూ.3 వేలు నగదును అందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అత్యధిక మార్కులు సాధించిన ఎనిమిది మందికి ఒక్కొక్కరికి రూ.1,116లు చొప్పున అందజేశారు. కాగా గరుగుపల్లి కట్టా నాగయ్య జ్ఞాపకార్థం కుమారుడు హరికృష్ణ రూ.6 వేలు, తురక లీలావతి జ్ఞాపకార్థం భర్త రంగారెడ్డి రూ.5,200లు, ఆకేపాటి వెంకటరెడ్డి జ్ఞాపకార్థం భార్య సావిత్రమ్మ రూ.5016లు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దుర్గరాజు, ముఖ్య అతిథులుగా ఎంఈఓలు కోదండ నాయుడు, ఈశ్వరయ్య, విద్యార్థులు, తల్లిదండ్రులు, మానవత సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికులను రెగ్యులర్ చేయాలి


గోడ పత్రాలను ఆవిష్కరిస్తున్న యూఈఈయూ నాయకులు

రాజంపేట రూరల్ : రాష్ట్రంలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులందరిని రెగ్యులర్ చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీకాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక డివిజనల్ విద్యుత్ కార్యాలయం వద్ద శుక్రవారం చలో విద్యుత్ సౌధ గోడపత్రాలను యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2022 పీఆర్‌సీ అరియర్స్‌ను వెంటనే కార్మికులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొత్త ఆపరేటర్లందరికి పాత ఆపరేటర్లతో సమానంగా జీతాలు ఇవ్వాలని ఫీల్డ్ అసిస్టెంట్లు అందరినీ స్కిల్ చేసి స్కిల్ వేతనం ఇవ్వాలని కోరారు. ప్రతి సబ్ స్టేషన్‌లో నైట్ వాచ్‌మెన్ వినియోగించాలని కోరారు. విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై సీఐటీయూ ఆధ్వర్యంలో ఆగస్టు 7న విజయవాడలో చేపట్టే చలో విద్యుత్ సౌధ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పీ–4 సర్వేపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

పెనగలూరు/లక్కిరెడ్డిపల్లె : పీ–4 ద్వారా నిరుపేద కుటుంబాలకు మంచి భవిష్యత్తు ఉంటుందని పెనగలూరు తహసీల్దార్ అమరేశ్వరి, లక్కిరెడ్డిపల్లె తహసీల్దార్ క్రాంతి కుమార్, ఎంపీడీఓ ఉషారాణిలు పేర్కొన్నారు. శుక్రవారం పెనగలూరు మండలం కట్టావారిపల్లి పంచాయతీలో, లక్కిరెడ్డిపల్లె మండలం మద్దిరేవుల గ్రామ సచివాలయంలో శుక్రవారం పీ–4పై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది సర్వే చేసి నిరుపేద కుటుంబాలను గుర్తించాలన్నారు. గుర్తించిన కుటుంబాల జాబితాను సచివాలయాల నోటీసు బోర్డులో పెట్టి అభ్యంతరాలను స్వీకరించి తుది జాబితా రూపొందించాలని తెలియజేశారు. ఆయా కార్యక్రమాల్లో కట్టావారిపల్లె సర్పంచ్ బాలు మోహనమ్మ, మద్దిరేవుల సర్పంచ్ తుమ్మల చంద్రమ్మ, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జూలై 30లోపు ఈ-కేవైసీ పూర్తి చేయాలి


డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న డీటీ రెడ్డన్న

లక్కిరెడ్డిపల్లి : ఈ నెల 26 నుంచి మండలంలోని అన్ని చౌక దుకాణాల పరిధిలోని రేషన్ డీలర్లు వృద్ధులకు, దివ్యాంగులకు, వితంతువులు ఇంటి వద్దకే వెళ్లి వేలిముద్రలు వేయించుకొని రేషన్ పంపిణీ చేయాలని డిప్యూటీ తహసీల్దార్ రెడ్డన్న పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం గుర్తించి వేలిముద్రలు పడని వారి జాబితా ఆధారంగా ప్రతి ఒక్కరూ కూడా బియ్యం, చెక్కర వంటి నిత్యావసర సరుకులను వారి ఇంటివద్దకే వెళ్లి తప్పకుండా పంపిణీ చేయాలని సూచించారు. అనంతరం ఎన్‌ఫోర్స్‌మెంట్ తహసీల్దార్ వెంకటరెడ్డి మాట్లాడుతూ జూలై 30వ తేదీలోపు ఈ–కేవైసీ నమోదు ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజేష్, రేషన్ డీలర్లు, వీఆర్ఓలు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ డ్రోన్లు పంపిణీ


డ్రోన్లను పంపిణీ చేస్తున్న అధికారులు

నందలూరు : మండలంలోని నల్లతిమ్మాయపల్లె పంచాయతీలో శుక్రవారం మండల వ్యవసాయాధికారి జి.మల్లికార్జున ఆధ్వర్యంలో రైతులకు వ్యవసాయ డ్రోన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 80 శాతం సబ్సిడీతో డ్రోన్లను రైతులకు అందజేస్తోందని తెలిపారు. ఆధునిక వ్యవసాయ పరికరాల వాడకం ద్వారా సాగులో ఖర్చులు, సమయం తగ్గించుకోవచ్చని కూలీల కొరతను అధిగమించవచ్చని తెలిపారు. అనంతరం డ్రోన్లను శ్రీ సౌమ్యనాథ స్వామి రైతు మిత్ర గ్రూపునకు యూనియన్ బ్యాంకు మేనేజర్ రామారెడ్డి సమక్షంలో అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా రామారెడ్డి మాట్లాడుతూ డ్రోన్లకు సబ్సిడీతో పాటు పంట రుణాలు, బంగారు రుణాలు కూడా అందజేస్తున్నామని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గడికోట వెంకటసుబ్బారెడ్డి, గీతాల నరసింహారెడ్డి, రైతులు, బ్యాంకు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

సెక్యూరిటీ సిబ్బందికి వేతనాలు చెల్లిస్తున్నాం

గాలివీడు : సోలార్‌లో పనిచేస్తున్న సిబ్బందికి క్రమం తప్పకుండా వేతనాలు చెల్లిస్తున్నామని, జూన్ మాసానికి సంబంధించి మాత్రం పది రోజులు ఆలస్యమైందని తూముకుంట టాటా సోలార్ కంపెనీ స్టార్ క్యాబెక్స్ సెక్యూరిటీ ఎండీ వినోద్, రీజినల్ మేనేజర్ భాస్కర్ వివరణ ఇచ్చారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ తమ ప్రాజెక్టు పరిధిలో రూ.30 లక్షల విలువైన 25 వేల మీటర్లు కేబుల్ వైరు చోరీకి గురైతే ఇదే సమస్యపై క్లయింట్‌కు నచ్చజెప్పే పనిలో వేతనాలు చెల్లింపు పది రోజులు ఆలస్యమైన మాట వాస్తవమేనన్నారు. అయితే విధి నిర్వహణలో సిబ్బంది అలసత్వం కారణంగానే ఇదంతా జరిగిందని, ఇలాంటి పరిస్థితుల్లో కూడా వేతనాలు చెల్లింపులో జాప్యం జరిగిందంటూ సిబ్బంది రోడ్డెక్కడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రాజెక్ట్ పరిధిలో దాదాపుగా పదుల సంఖ్యలో చోరీలు జరుగుతున్నప్పటికీ సిబ్బంది అడ్డుకోలేకపోవడం శోచనీయమంటూ విచారం వ్యక్తం చేశారు.

విద్యార్థినికి కృత్రిమ చేయి ఏర్పాటు

మదనపల్లె సిటీ : జవహర్ నవోదయ విద్యాలయంలో 12వ తరగతి చదువుతున్న విద్యార్థిని శివానికి కడప రిమ్స్‌లో కృత్రిమ చేయిని ఏర్పాటు చేశారు. శివాని పుట్టుకతోనే కుడిచెయ్యి లేకుండా పుట్టింది. ఆమె తన పనులు చేసుకోవడానికి కష్టమతుంది. ఈ విషయం తెలుసుకున్న ప్రిన్సిపాల్ ఎం.గీత జిల్లా కలెక్టర్ శ్రీధర్ దృష్టికి తీసుకెళ్లి విద్యార్థినికి రిమ్స్‌లో విద్యార్థినికి కృత్రిమ చేయిని అమర్చారు.

నేలకొరుగుతున్న నిర్లక్ష్యం!

- సబ్ కలెక్టర్ కార్యాలయానికి అనుకొని ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం
- విద్యుత్ శాఖ అలసత్వం వీడాలంటున్న స్థానికులు


ప్రమాదరకంగా ఉన్న విద్యుత్ స్తంభం

రాజంపేట టౌన్ : పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయం పక్కనే ఉన్న వినాయకనగర్‌లో మూడు విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. నేలకొరిగేలా ఉన్న రెండు విద్యుత్ స్తంభాలు అక్కడ ఉన్న సచివాలయానికి సమీపంలో ఉండగా, ఒక విద్యుత్ స్తంభం వినాయకుడి గుడికి అనుకొని ఉంది. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమై గాలి వీస్తుండటంతో విద్యుత్ స్తంభాలు ఇళ్లపై ఎక్కడ పడతాయోనన్న భయాందోళన ఆ ప్రాంత ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఆ ప్రాంతంలో ఓ ప్రైవేట్ పాఠశాల కూడా ఉండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు, సచివాలయానికి వివిధ పనులపై వచ్చే ప్రజలు, గుడికి వచ్చే భక్తులు విద్యుత్‌స్తంభాలు ఒరిగిపోయి ఉండటంతో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియక ఆందోళన చెందుతున్నారు. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలు సబ్‌కలెక్టర్ కార్యాలయం ప్రహరీ గోడను అనుకునే ఉన్నాయి. సబ్‌కలెక్టర్ కార్యాలయంలో చెట్లు ఎక్కువగా ఉండటం వల్ల ఓ మోస్తారు గాలి వీచినా విద్యుత్ స్తంభాలు నేలకొరిగితే జరగరాని ప్రమాదం జరిగే అవకాశం లేకపోలేదని ఆ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. పాఠశాలకు విద్యార్థులు వెళ్లే సమయంలో కాని లేక ఇంటికి వెళ్లే సమయంలో ఏ ఒక్క విద్యుత్ స్తంభం కిందపడినా ఆ విద్యుత్ స్తంభానికి ఉండే వైర్లలోని కరెంటు వల్ల ఊహించని ప్రమాదం జరిగే అవకాశం ఉంటుంది. అందువల్ల విద్యుత్‌శాఖ అధికారులు వెంటనే స్పందించి ఎలాంటి ప్రమాదం జరగకముందే సమస్యను పరిష్కరించాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. విద్యుత్‌శాఖ అధికారులు అలసత్వం వహించి ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే అందుకు విద్యుత్‌శాఖ అధికారులే బాధ్యత వహించాల్సి వస్తుందని అక్కడి ప్రజలు తెలియజేశారు.

నకిలీ నర్సరీలపై చర్యలు తీసుకోవాలి


పొన్నేళ్లవాండ్లపల్లె సమీపంలో బొప్పాయి పంటను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

సంబేపల్లె : నకిలీ నర్సరీలపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సభ్యులు పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నారాయణరెడ్డిపల్లె గ్రామం పొన్నేళ్లవాండ్లపల్లె సమీపంలో రైతు భాస్కర్ సాగు చేసిన బొప్పాయి పంటను రైతు సంఘం నాయకులు రంగారెడ్డి, హరినాథ్‌బాబు, కేవీఎస్ నాయుడు, అంజద్, అర్జున్‌రెడ్డిలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో కలికిరి, తుమ్మలపల్లె, మదనపల్లె, గుర్రంకొండ మండలాల్లోని నర్సరీలలో నకిలీ బొప్పాయి నారును రైతులు తీసుకుని సాగు చేయడంతో ఎంతో మంది నష్టపోయారన్నారు. ఇప్పటికీ అనుమతులు లేకుండా ఎన్నో నర్సరీలు నడుపుతున్నారన్నారు. అరకొరగా బొప్పాయి పంట చేతికి వస్తే దళారులు ధరలను తక్కువ చేస్తూ రైతులను ముంచుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు నకిలీ విత్తనాలు, నర్సరీలపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

పందుల నివారణకు అధికారుల చర్యలు


పందుల నివారణ చర్యలు చేపడుతున్న పంచాయతీ కార్యదర్శి

ఒంటిమిట్ట : ఆంధ్రా భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండ రాముడు వెలసిన ఏకశిలా నగిరి అయినటువంటి ఒంటిమిట్టలో పందులు గత కొన్ని నెలలుగా స్వైరవిహారం చేస్తున్నాయి. వాటిని నివారించాలని ఒంటిమిట్ట పంచాయతీ కార్యదర్శి సుధాకర్ పలుమార్లు యాజమానులకు నోటీసులు జారీ చేసినా నివారించకపోవడంతో స్వయంగా ఆయనే రంగంలోకి దిగి పందుల నివారణ చర్యలు చేపట్టారు. శుక్రవారం మండల కేంద్రమైన ఒంటిమిట్టలోని రైల్వే స్టేషన్‌ను పోవు మార్గంలో పందులు స్వైరవిహారం చేస్తున్నాయని తెలిపి నివారణ చర్యలో భాగంగా పందుల యజమానులతో పందులను బంధించి దూర ప్రాంతాలకు తరలించారు. మరలా పంచాయతీ ఆదేశాలకు విరుద్ధంగా ఒంటిమిట్టలో పందులు కనబడితే యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఒంటిమిట్ట వీఆర్‌ఓ అంజయ్య, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పారదర్శకతకే సమాచార హక్కు చట్టం

రాజంపేట రూరల్ : అధికార యంత్రాంగంలో పారదర్శకత, జవాబుదారితనంతో పాటు సమాచారాన్ని ప్రజలకు అందజేసేందుకు నెలకొల్పబడినదే సమాచార హక్కు చట్టమని మండల వ్యవసాయ అధికారి జి.నాగలక్ష్మి తెలియజేశారు. స్థానిక మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో శుక్రవారం రైతులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ప్రభుత్వం వద్దనున్న సమాచారాన్ని ప్రజలు పొందేందుకు 2005లో చట్టం తీసుకొచ్చారన్నారు. ప్రతి ఒక్కరూ తమకు కావాల్సిన సమాచారాన్ని ప్రతిశాఖలో సంబంధిత పౌర సమాచార అధికారికి దరఖాస్తు చేసుకొని పొందవచ్చునన్నారు.

నందలూరు : సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయాధికారి జి.మల్లికార్జున తెలిపారు. మండలంలోని నల్లతిమ్మాయపల్లి రైతు సేవా కేంద్రంలో శుక్రవారం సమాచార హక్కు చట్టంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమకు కావాల్సిన సమాచారాన్ని వ్యవసాయ శాఖలో సంబంధిత పౌర సమాచార అధికారికి దరఖాస్తు చేసి సమాచారాన్ని పొందవచ్చునని అన్నారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలి

రాయచోటి జగదాంబసెంటర్ : ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలని పీసీఎస్‌ఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ చెన్నారెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ సూచనల మేరకు పీసీఎస్‌ఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ, జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. చెన్నారెడ్డి మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చిన్నచూపు చూడకుండా సమాజంలో కలసిమెలసి జీవించే విధంగా సహకరించాలని కోరారు. అనంతరం పలు సూచనలు, సలహాలను అందజేశారు. కార్యక్రమంలో డీఐఎస్ ప్రసాద్, స్వాతి, ప్రిన్సిపల్ చంద్రశేఖర్, గోపాల్, ప్రవీణ, అలేఖ్య, సుహాసిని, విజయలక్ష్మి, ఖాదర్‌వలీ, కుమార్ పాల్గొన్నారు.